నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, బుధవారం 7 ఫిబ్రవరి 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY



కల్వకుర్తిలో టిప్పర్‌లో ఇసుకను తరలిస్తున్న వ్యాపారులు

# దుందుభీలో దొంగలు

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- అనుమతుల ముసుగులో అడ్డగోలుగా..
- నిత్యం తోడేస్తున్న మాఫియా
- పరిమితికిమించి టిప్పర్లలో రవాణా
- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి

కల్వకుర్తి, ఫిబ్రవరి 6 : దుందుభీ నదిని ఇసుకాసురులు తోడేస్తున్నారు. అభివృద్ధి పనులు, గృహ నిర్మాణ అవసరాలకు ఇచ్చిన అనుమతుల ముసుగులో అడ్డగోలుగా రవాణా చేస్తున్నారు. ఇసుక కొరతను అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ టిప్పర్ ఇసుకను రూ.40 వేలకుపైగా విక్రయిస్తున్నారు. కల్వకుర్తి, అచ్చంపేట, నాగర్‌కర్నూల్‌తోపాటు పలు ప్రాంతాలకు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నా రు. దీంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని రైతులు ఆందోళనచె ందుతున్నారు.

***వంగూరులో ఇసుక రీచ్‌లు..***

వంగూరు మండలం పోతారెడ్డిపల్లి, ఉల్పర గ్రామాల సమీపంలోని దుందుభీ వాగులో ఇసుక తీయడానికి రీచ్‌లను అధికారులు గుర్తించారు. అభివృద్ధి పనులతోపాటు డొమెస్టిక్ ఇసుక తీయడానికి డీఎల్‌ఎస్‌సీ అధికారులు అనుమతులిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో మాత్రమే సరఫరా చేసే విధంగా ప్రొసీడింగ్‌లు ఉన్నాయి. అభివృద్ధి పనులకు ఇసుక సరఫరా చేసేందుకు జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు నిర్వహణ కమిటీకి దరఖాస్తు చేసుకున్నారు. సీనరీజ్ చార్జెస్ కింద కమిటీలో గతనెల 2న ఒకరు రూ.4.80 లక్షలు ధరావత్తు చేయగా.. మరో వ్యక్తి రూ.10.68 లక్షలు డిపాజిట్ చేశాడు. దీంతో జనవరి 5న నిర్వహించిన డీఎల్‌ఎస్‌సీ సమావేశం లో ఇసుక రవాణాకు వీరికి అనుమతులు ఇచ్చారు. ఒకరికి 60 టిప్పర్లు, మరొకరికి 133 టిప్పర్ల ఇసుకను తరలించాలనినిర్ణ యించింది.

***నిబంధనలు ఇలా..***

60 టిప్పర్ల ఇసుకను సరఫరా చేసే కాంట్రాక్టర్ జనవరి 16వ తేదీ నుంచి 25 రోజులపాటు, 133 ట్రిప్పుల కాంట్రాక్టర్ గతనెల 11తేదీ నుంచి 30 రోజులపాటు రీచ్‌ల నుంచి ఇసుక తరలించాలి. ఒక టిప్పర్‌లో కేవలం 15 క్యూబిక్ మీటర్ల ఇసుకను మాత్రమే నింపాలి. అంటే బరువుగా లెక్కిస్తే టిప్పర్ ఇసుక 15 నుంచి 17 టన్నులలోపు మాత్రమే ఉండాలి. 60 ట్రిప్పర్ల కాంట్రాక్టర్‌కు 900 క్యూ బిక్ మీటర్లు, 133 టిప్పర్ల కాంట్రాక్టర్‌కు 2000 క్యూబిక్ మీటర్ల ఇసుకను కేటాయిస్తూ అధికారులు ప్రొసీడింగ్‌లు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన వే బిల్లులు కూడా ఇచ్చారు.

***ఉల్లంఘన..***

ప్రభుత్వ అభివృద్ధి పనులతోపాటు గృహ అవసరాలకు సరఫరా చేయాల్సిన ఇసుకను యథేచ్ఛగా బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక టిప్పర్‌లో 15 క్యూబిక్ మీటర్ల ఇసుకను నింపాల్సి ఉండగా.. 35 నుంచి 40 క్యూబిక్ మీటర్లకుపైగా ఇసుక నింపుతున్నారు. దాదాపు 17 టన్నుల బరువు ఇసుకను సరఫరా చేయాల్సిన టిప్పర్లు 40 టన్నులకుపైగా ఇసుకను సరఫరా చేస్తున్నారు. ఉదయం మాత్రమే రీచ్‌ల నుంచి ఇసుకను తీయాలనే నిబంధనలు ఉన్నా.. రాత్రి వేళల్లో కూడా ఇసుకను తీస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

***టిప్పర్ల జాతర..***

కొన్ని టిప్పర్లు అభివృద్ధి పనులకు ఇసుకను సరఫరా చేస్తుంటే.. మరికొన్ని టిప్పర్లు గృహావసరాలకు విక్రయిస్తున్నాయి. టన్ను ఇసుక రూ.1,100 వరకు లభ్యమవుతున్నది. వంగూరు మండలం పోతారెడ్డిపల్లి, ఉల్పర నుంచి కల్వకుర్తి టిప్పర్ల జాతర సాగుతున్నది. జనవరి 24, 25వ తేదీలతోపాటు ఇసుకను సరఫరా చేశారు. దాదాపు 60 ట్రిప్పుల కాంట్రాక్టర్ 8 టిప్పర్లతో ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం. ప్రతి టిప్పర్ రోజుకు మూడు ట్రిప్పులకుపైగానే సరఫరా చేస్తుందని రైతులు చెబుతున్నారు. అంటే ప్రతి రోజు 24 టిప్పర్ల ఇసుక సరఫరా అవుతున్నది. ఈ లెక్కన చూస్తే ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడినట్లే. ప్రతి క్యూబిక్ మీటర్ ఇసుకకు ప్రభుత్వానికి దాదాపు రూ.534 ఆదాయం సమకూరుతుంది. ఒక క్యూబిక్ మీటర్‌కు సీనరిజ్ చార్జీల కింద డబ్బులు చెల్లించి.. అందినకాడికి దోచుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

***అనుమతులు ఉన్నాయి.. కదా..***

ఇసుక సరఫరా విషయాన్ని సంబంధిత అధికారులను అడిగితే అనుమతులు ఉన్నాయి కదా..? అని సమాధానం ఇస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. అసలు విషయానికొస్తే అధికార పార్టీ నాయకుల అండదండలతోనే ఈ దందా నడుస్తుందనే ఆరోపణలు లేకపోలేదు. ఇష్టానుసారంగా ఇసుకను తరలిస్తే భూగర్భ జలాలు అడుగంటి పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వానకాలం నుంచి వర్షాలు సరిగ్గా కురవలేదని, జనవరి నాటికే కృష్ణా సాగుజలాల కాల్వలు బంద్ అయ్యామని, ఇప్పటికే సాగునీటికి కష్టాలు పడుతుంటే.. కొత్తగా ఈ దందా ఏమిటని దుందుభీ నదీ పరిసరాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రావాలి



ప్రభుత్వ భవనాలు, రోడ్ల నిర్మాణాలకుగానూ అధికారులు ఇసుకకు అనుమతులిస్తున్నారు. కానీ సామాన్య ప్రజలకు మాత్రం ఇవ్వడం లేదు. గృహ నిర్మాణాలకు ఇసుక దొరకడం కష్టంగా మారింది. గతంలో దుప్పల్లి, కరివెన గ్రామాల్లో ఇసుక రీచ్‌లు ఉండేవి. మీసేవలో అప్లై చేసుకుంటే అనుమతులు లభించేవి. ట్రాక్టర్ల ద్వారా ఇసుక తెప్పించుకునేవాళ్లం. ఇప్పుడు రీచ్‌లు మూతపడడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇంటికి ఇసుక అవసరమైతే ఎక్కడికి వెళ్లాలో అర్థం కావడం లేదు. మీసేవలో అడిగితే సైట్ పనిచేయడం లేదంటున్నారు. అధికారులు దీనిపై దృష్టి సారించి వెబ్‌సైట్ ఓపెన్ చేస్తే బాగుంటుంది. గత్యంతరం లేక ఎడ్ల బండ్లపై ఇసుక తెప్పించుకోవాల్సి వస్తున్నది. ఒక్కో బండికి రూ.800 చొప్పున వసూలు చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి ఇబ్బందులను తొలగించాలి.


**– లక్ష్మీనారాయణ, దుప్పల్లి గ్రామం, మదనాపురం మండలం**

## ప్రైవేట్ వ్యాపారులు దోచుకుంటున్నారు..




ఆన్‌లైన్‌లో ఇసుక దొరకకపోవడంతో ఇల్లు కట్టుకునేందుకు గత్యంతరం లేక ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తే అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అది కూడా నాణ్యతగా ఉండడం లేదు. అయినా తప్పని పరిస్థితిలో కొనుగోలు చేయాల్సి వస్తున్నది. పది నెలలుగా పెద్దమందడి మండలంలో క్వారీలు తెరవకపోవడంతో ఆశలు వదులుకొని ప్రైవేట్‌గా వ్యాపారుల నుంచి కొనుక్కొని ఇల్లు కట్టుకుంటున్నాను. ఆన్‌లైన్ ఇసుకకు, వ్యాపారస్తులకు రూ.500 వరకు ధరలో వ్యత్యాసం ఉంటున్నది. గతంలో మా గ్రామంలో ఆన్‌లైన్‌లో ఇసుకను బుక్ చేయగా.. ఇంతవరకు రాలేదు, డబ్బులు కూడా తిరిగి రాలేదు. ఇప్పటికైనా అధికారులు ఇసుక రీచులు ఓపెన్ చేసి ఆన్‌లైన్ ఇసుకను అందుబాటులో ఉంచితే సౌలభ్యంతోపాటు నాణ్యవంతంగా ఉంటుంది.

**– ముడావత్ కిషన్‌నాయక్, ముందరితండా, పెద్దమందడి మండలం**



హైదరాబాద్‌లోని నందీనగర్‌లో ఉన్న నివాసగృహంలో చలో నల్లగొండ సభ నిర్వహణకు సంబంధించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, గువ్వల బాలరాజు, పట్నం నరేందర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, అంజయ్య యాదవ్, నాయకులతో సమావేశమైన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్..

- ఉమ్మడి జిల్లాలో ఇసుక కొరత
- ఆకాశాన్నంటుతున్న ధరలు
- బంద్ అయిన కొన్ని ఇసుక రీచ్‌లు
- అధికార పార్టీ అండదండలు



- దొడ్డిదారిన తరలిస్తున్న మాఫియా
- సామాన్యులకు దొరకని వైనం

- అధిక ధరలకు కొనుగోలు చేస్తుండడంతో జేబులకు చిల్లు
- సంక్షోభంలో నిర్మాణ రంగం

### అందుబాటులోలేని వైనం

ఐదు జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో ఇసుక ఇబ్బడి, ముబ్బడిగా లభ్యమవుతుంది. కానీ ఈ ఇసుకను ప్రజలకు చౌకగా అందించాల్సిన అధికారులు ఇసుక మాఫియాతో కుమ్మక్కై ధరలు పెంచడానికి కారణమవుతున్నారు. నారాయణపేట జిల్లాలో ప్రభుత్వమే మన ఇసుక విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఇసుక కావాల్సిన వారు నేరుగా ప్రభుత్వ వెబ్‌సైట్‌లోకి వెళ్లి బుకింగ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. దీనిపై అవగాహన లేకపోవడంతో చాలామంది ఇసుక మాఫియాకు చెందిన కాంట్రాక్టర్లు బుకింగ్ చేసుకొని ఇసుకను బ్లాక్‌లో అమ్ముతున్నారు. వనపర్తిలో కూడా ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేసి ఆన్‌లైన్ అందుబాటులోకి తీసుకొచ్చినా సామాన్యులకు మాత్రం దొరకడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

# ఇసుకే బంగారమాయేనా?

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఇసుక బంగారమైంది. సామాన్యులకు దొరకడం గగనమైంది. ఉమ్మడి జిల్లాలో కొరత ఏర్పడడంతో గృహ నిర్మాణదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆయా జిల్లాల్లో ఇసుక రీచ్‌లు ఉన్నా అధికార పార్టీ ఆదేశాల మేరకు ఎక్కడికక్కడే నిలిపివేశారు. మరోవైపు కల్వకుర్తిలో అధికార పార్టీ అండదండలతో ఇసుక మాఫియా రెచ్చిపోతున్నది. అడ్డగోలుగా రవాణా చేస్తుండడంతో దుందుభీతోపాటు, వాగుల పరీవాహక ప్రాంతాల్లోని పొలాల రైతులు గగ్గోలు పెడుతున్నారు. మరోవైపు ఇసుక రీచ్‌లకు అనుమతి ఇచ్చినా ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారయంత్రాంగం విఫలమైంది. దీంతో ఇసుక కాంట్రాక్టర్లు ప్రైవేట్ పేరిట బుకింగ్ చేసుకొని కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. ఇసుక దొరక్క చాలామంది నిర్మాణాలు నిలిపివేసుకున్నారు.

***నిర్మాణ రంగం కుదేలు***

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గృహ నిర్మాణ రంగం పూర్తిగా కుదేలైంది. బ్లాక్ మార్కెట్లో ఇసుక ట్రాక్టర్ రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు పలుకుతున్నది. ఒక టిప్పర్ మాత్రం రూ.30 వేలకు చేరింది. గృహ నిర్మాణ రంగంలో తక్కువ ధరకు దొరికే ఇసుక కాంట్రాక్టర్లు, అధికారులు, అధికార పార్టీ నేతల కారణంగా ధరలు చుక్కలనంటాయి. మరోవైపు కాంగ్రెస్ పార్టీ నేతల అండదండలతో చాలా జిల్లాల్లో రాత్రికి రాత్రే ఇసుకను అక్రమంగా తరలిస్తూ రూ.లక్షలు సంపాదిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఇసుక కొరతను దృష్టిలో ఉంచుకొని కొంతమంది నకిలీ వ్యాపారులు కృత్రిమ ఇసుకను తయారుచేసి జనాల నెత్తి మీద కుచ్చుటోపీ పెడుతున్నారు.

***అధికార పార్టీ దబాయింపులు..***

మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల, నారాయణపేట, వనపర్తి జిల్లాల్లో ఇసుక నిల్వలు అవసరానికి సరిపడా ఉన్నాయి. అయితే అధికారంలోకి రాగానే కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలతో అధికారులను బెదిరించి ఇసుక రీచ్‌లను నిలిపివేశారు. టీఎస్‌ఎండీసీతోపాటు ఆయా జిల్లాల్లో కలెక్టర్ల ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్‌ను ఏర్పాటు చేశారు. వీటి కింద ఇసుక అమ్మితే లాభం ఏమిటని అనుకున్న మాఫియాతో అధికార పార్టీ నేతలు కుమ్మకై ఎక్కడికక్కడే రీచ్‌లను నిలిపివేశారు. దీంతో రూ.1500కు టన్ను దొరకాల్సిన ఇసుక రూ.3 వేల నుంచి రూ.4 వేలకు చేరింది. నిర్మాణ రంగంలో ప్రధానంగా దొరికే ఇసుకకు కృత్రిమ కొరతను సృష్టించి మాఫియా రూ.లక్షలు ఆర్జిస్తున్నది. మరోవైపు దేవరకద్ర, మక్తల్, పాలమూరు, జడ్చర్ల, కల్వకుర్తి, వనపర్తి, కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాలకు చెందిన హస్తం పార్టీ నేతలు రాత్రిళ్లు యథేచ్ఛగా ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం. పోలీస్, అధికారులు రవాణాను అడ్డుకోవడంలో విఫలమవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పర్యవేక్షించాల్సిన మైనింగ్ శాఖ చేతులెత్తేసింది. ఇప్పటికైనా ఆయా జిల్లా కలెక్టర్లు మేల్కొని ఇసుకను తక్కువ ధరకు అందుబాటులోకి తేవాలని సామాన్యులు కోరుతున్నారు.

# ఆన్‌లైన్ ఇసుకతో అవస్థలు

- వనపర్తి జిల్లాలో 11 రీచ్‌లు
- ఐదింట్లో నిలిచిన బుకింగ్‌లు
- ప్రత్యామ్నాయం కోసం వెతుకులాట
- అడ్డదారుల్లో దళారులకు ఈజీగా..
- అధిక ధరలతో జనం బెంబేలు



మదనాపురం మండలంలోని వాగులో ఇసుక నింపుకొంటున్నఎడ్ల బండ్లయజ మానులు

వనపర్తి, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : ఇసుక మాఫియా పేట్రేగిపోతున్నది. ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ నిలిచిపోవడంతో దళారులదే రాజ్యమైంది. రాత్రి పగలు తేడా లేకుండా దర్జాగా తరలిస్తూ అడ్డగోలు ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వనపర్తి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో గడచిన ఐదు నెలలుగా ఇదే పరిస్థితి. దీంతో వినియోగదారులంతా ఇటు అధిక ధరలు చెల్లించలేక.. అటు ఆన్‌లైన్ బుకింగ్ చేసుకునే అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారు. గత నెలలో నిర్వహించిన జెడ్పీ సమావేశంలోనూ ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ కావడం లేదన్న చర్చ జరిగిన సంగతి తెలిసిందే. జిల్లాలో గుర్తించిన క్వారీల్లో నుంచి ఇసుకను తరలించేందుకు ఆన్‌లైన్ బుకింగ్ నిలిచిపోవడంతో రవాణా ఆగిపోయింది. దీంతో నిర్మాణాలు చేపట్టిన వారికి కొరత ఏర్పడింది.

***11 రీచ్‌లుంటే..***

వనపర్తి జిల్లాలో 11 వరకు ఇసుక రీచ్‌లు ఉన్నాయని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. వీటిలో పెబ్బేరు మండలం శాగాపురం, రామంతాపూర్, కొత్తకోట మండలం పామాపురం, అప్పరాల, ఆత్మకూరు మండలం తిప్పడంపల్లి, రేచింతల, పెద్దమందడి మండలం చిలకటోనిపల్లి, ఖిల్లాఘణపురం మండలం కమాలుద్దీన్‌పూర్, మదనాపురం మండలం కర్వెన, దుప్పల్లి, వీపనగండ్ల మండలం తూంకుంటలో ఇసుక రీచ్‌లు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న వారికి వీటి ద్వారానే ప్రభుత్వ లెక్క ప్రకారం ఇంటికే ఇసుక వస్తుంది. ఒక్కో రీచ్ నుంచి ఆయా దూరం మేరకు ధరలు నిర్ణయించారు. కలెక్టరేట్ కార్యాలయంలో ఆయా రీచ్‌లకు సంబంధించి ఆన్‌లైన్ వెబ్‌సైట్ ఓపెన్ చేస్తేనే ఇసుకను బుకింగ్ చేసుకునే అవకాశం ఉంటుంది.

***ఐదు క్వారీల్లో బుకింగ్ బంద్***

జిల్లాలోని ఐదు ఇసుక క్వారీల్లో ఆన్‌లైన్ బుకింగ్ నిలిచిపోయింది. వీటిలో వీపనగండ్ల మండలం తూంకుంట, మదనాపురం మండలం దుప్పల్లి, కర్వెన, ఖిల్లా ఘణపురం మండలం కమాలుద్దీన్‌పూర్, పెద్దమందడి మండలం చిలకటోనిపల్లి శివారులోని ఇసుక క్వారీల్లో ఆన్‌లైన్ బుకింగ్‌లు ఐదు నెలలుగా నిలిచిపోయాయి. ఈ సెంటర్లలోనూ ఎప్పుడో ఒకసారి అధికారులకు ఇష్టం ఉన్నప్పుడు కొంత సమయం ఆన్‌లైన్ బుకింగ్ అవకాశం ఇచ్చి నిలిపి వేశారు. ఇలా ఎందుకు జరుగుతుందని ఆరా తీసినా సరైన సమాధానం వారి నుంచి రావడం లేదని ఆరోపణలు ఉన్నాయి. నెలల తరబడి ఆన్‌లైన్ బుకింగ్ లేకపోవడంతో అవసరమైన కస్టమర్లు చేసేది లేక అడ్డదారుల్లోనే ఇసుకను కొనుగోలు చేస్తున్నారు. ఇంటి నిర్మాణాలే కాకుండా ఏ చిన్న మరమ్మతులు చేసుకోవాలన్న ఇసుక తప్పనిసరి. ఈ క్రమంలో బ్లాక్‌లోనే కొనుగోలు చేసుకోవాల్సి వస్తుంది. ఆన్‌లైన్ బుకింగ్ నిలిచినా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

***దళారులకు ధనార్జనే..***

ఐదు ఇసుక క్వారీల నుంచి ఇసుక రవాణా నిలిచిపోయింది. దీంతో ఆయా ప్రాంతాల్లోని మాఫియా సరఫరా చేసే ఇసుకకు డిమాండ్ ఏర్పడింది. ఇష్టమొచ్చిన ధరలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో దొరకని ఇసుక అడ్డదారుల్లో ఈజీగా అందుతున్నది. దీంతో అధిక ధరలకు కొనుగోలు చేసి వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనికి తోడు సమయానికి ఇసుక అందక కొందరు ఇబ్బందులు పడుతుంటే.. అధిక ధరలతో మరికొందరు తప్పక కొనుగోలు చేస్తున్నారు. ఆన్‌లైన్ బుకింగ్ అయితే రూ.2,500కే ట్రాక్టర్ ఇసుకను పొందే అవకాశం ఉన్నది. అదే బ్లాక్‌లో కొనుగోలు చేయాలంటే రూ.3 వేల నుంచి రూ.4వేల వరకు చెల్లించాల్సి వస్తుంది. ఒక్కో ట్రాక్టర్‌పై రూ.1500 వరకు అదనంగా దళారులు వసూలు చేస్తున్నారు. దీంతో వినియోగదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి.

***ప్రత్యామ్నాయాల కోసం..***

ఆన్‌లైన్ బుకింగ్ నిలిచిపోయిన ఇసుక క్వారీల స్థానంలో ప్రత్యామ్నాయాలను గుర్తించడం కోసం కలెక్టరేట్ నుంచి ఆర్డీవో కార్యాలయానికి సిఫారసు చేశారు. ఆర్డీవో పర్యవేక్షణలో తాసీల్దార్, జిల్లా గ్రౌండ్‌వాటర్ అధికారి, మైనింగ్ ఏడీ, జిల్లా సర్వే అధికారులు పరిశీలించి రిపోర్ట్ ఇవ్వాల్సి ఉన్నది. నిలిచిన క్వారీల్లో ఆన్‌లైన్ బుకింగ్ అందుబాటులోకి రావాలంటే ఈ అధికారుల బృందం పరిశీలన చేసిన తర్వాత క్వారీలను గుర్తిస్తేనే సాధ్యమవుతుంది. గత నెల 9న ఈ బృందానికి ప్రత్యామ్నాయ క్వారీలను చూడాలని ఆదేశాలు జారీ అయినా అందుబాటులో లేవని, మరో నెల గడిస్తే గుర్తించే అవకాశం ఉన్నదని కలెక్టర్ కార్యాలయానికి తెలిపారు.

### ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం..

ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ లేకుండా నిలిచిన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. రీచ్‌లను ఏర్పాటు చేసేందుకు జాయింట్ ఇన్‌స్పెక్షన్ టీంకు సమాచారం అందించాం. ఆర్డీవో ద్వారా కమిటీ సభ్యుల బృందం పర్యవేక్షణ జరిపి ఇసుక తరలింపునకు అనుకూలంగా క్వారీలు లేవని రిపోర్ట్ ఇచ్చింది. అయితే, ప్రత్యామ్నాయంగా క్వారీలను తప్పనిసరి గుర్తించాల్సిందేనని కలెక్టర్ ఆదేశించారు. త్వరలోనే గుర్తించి అన్ని కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్‌లు జరిగేలా చర్యలు తీసుకుంటాం.

***– రమేశ్‌రెడ్డి, సూపరింటెండెంట్, వనపర్తి కలెక్టరేట్***

# రేవంత్.. ఖబడ్దార్

- దేవరకద్ర, కొత్తకోటలో సీఎం దిష్టిబొమ్మ దహనం

దేవరకద్ర, ఫిబ్రవరి 6 : బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం దేవరకద్రలో బీఆర్‌ఎస్ నాయకులు సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బాలరాజు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి గల్లీ లీడర్‌లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకే బీఆర్‌ఎస్ అధినేతపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. పాలన చేతకాక ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన రెండు నెలల్లోనే ప్రజల్లో వ్యతిరేకత నెలకొన్నదన్నారు. కేసీఆర్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని వివరించారు. కేసీఆర్ తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి తెలంగాణను సాధించారన్నారు. అసహనంతో ఆరోపణలు చేస్తే హస్తం పార్టీ నాయకులను ప్రజలు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు తరిమికొడతారని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్‌యాదవ్, ఆంజనేయులు, వెంకటేశ్, రాందాస్, చల్మారెడ్డి, యుగేంధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాధాకృష్ణ, జక్కి, రాము, ఆంజనేయులు, భార్గవ్ ఉన్నారు.

***అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా..***

కొత్తకోట, ఫిబ్రవరి 6 : కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా పాలెం గ్రామంలో బీఆర్‌ఎస్ నేతలు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్యారెంటీల మాటున గద్దెనెక్కారన్నారు. ఇప్పటి వరకు రైతుబంధు నిధులు కూడా విడుదల చేయలేని అసమర్థ పాలన కొనసాగిస్తున్నారంటూ మండిపడ్డారు. గ్యారెంటీలు అమలు చేయకపోతే బీఆర్‌ఎస్ పార్టీ తరపున ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, వెంకటన్న, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



దేవరకద్రలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

# పారిశుధ్యంపై ఫోకస్


- నేటి నుంచి 15 వరకు గ్రామాల్లో పారిశుధ్యవా రోత్సవం
- ప్రత్యేకఅ ధికారులఆ ధ్వర్యంలోనిర్వ హణ
- తాగునీటిక ల్పన,పిచ్చి మొక్కలతొ లగింపునకుచ ర్యలు
- భారంగా మారిన బకాయిలు
- అధికారులకుసవా ల్



గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది (ఫైల్)

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : పల్లెల్లో పారిశుధ్య కార్యక్రమాల అమలుకు పంచాయతీ రాజ్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. బుధవారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు నిర్వహించే స్పెషల్‌డ్రైవ్ కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సర్పంచుల కాలపరిమితి ముగిసిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో పారిశుధ్య వారోత్సవం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామాల్లో ఇండ్ల మధ్య పేరుకుపోయిన చెత్త, మురుగు తొలగించడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి పనులు చేపట్టనున్నారు. అలాగే ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకోనున్నారు. వేసవికాలం సమీపిస్తున్న నేపథ్యంలో తాగునీటి సమస్యలను గుర్తించడం, పైపులైన్ల లీకేజీని అరికట్టడం, కొత్తగా అవసరమైన బోర్లు, పైపులైన్లు వేయడం, వీధి లైట్ల వంటి సమస్యలనూ గుర్తించనున్నారు. స్థానిక సంస్థల పర్యవేక్షణలోనే తాగునీటి నిర్వహణ జరగాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. నర్సరీల పర్యవేక్షణ, డంపింగ్ యార్డు, శ్మశాన వాటిక నిర్వహణ, పారిశుధ్య పనులు చేసేందుకు కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. ఇక అంగన్‌వాడీలు, స్కూళ్లు, పీహెచ్‌సీలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద పిచ్చి మొక్కలు, చెత్త తొలగింపు, పాడుబడ్డ బావులను పూడ్చడం వంటి పనులు చేపడతారు. ఈ కార్యక్రమ అమలు కోసం ఇప్పటికే ఆయా జిల్లాల అధికారులు సమీక్షా సమావేశం నిర్వహించి లక్ష్యాలు నిర్దేశించారు. అయితే గ్రామాల్లో తగిన స్థాయిలో పారిశుధ్య సిబ్బంది లేరు. అదే విధంగా పారిశుధ్య కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ట్రాక్టర్ల డీజిల్ బిల్లుల కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల నుంచి గ్రామాల్లో పర్యవేక్షణ కరువైంది. కనీస పారిశుధ్య చర్యలనూ పట్టించుకునే నాథుడే లేరు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించలేదు. ఫలితంగా బకాయిల భారం, సిబ్బంది లేమి సమస్యలు గ్రామ పంచాయతీల నిర్వహణకు భారంగా మారాయి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పల్లె ప్రగతి పేరిట జరిగే పారిశుధ్య వారోత్సవాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు భాగమయ్యేవారు. ఇప్పుడు ప్రజాప్రతినిధులు పాల్గొనడం సందేహంగా మారింది. స్థానికంగా కాంగ్రెస్‌కు పట్టు లేకపోవడంతో ఎమ్మెల్యేలు వంటి ప్రజాప్రతినిధులూ భాగం కాలేకపోవడంతో స్పెషల్ డ్రైవ్ భారమంతా అధికారులపై పడింది. మరి ఈ కార్యక్రమం ఎంత వరకు సక్సెస్ అవుతుందన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ ఉమ్మడి పాలమూరులోని 1,692 గ్రామ పంచాయతీల్లోని ప్రత్యేక అధికారులకు సవాల్‌గా నిలవనున్నది.

### 15 వరకు పారిశుధ్య కార్యక్రమాలు..



ప్రభుత్వ ఆదేశాలతో బుధవారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు పారిశుధ్య వారోత్సవాలు నిర్వహించనున్నాం. అధికారులకు శిక్షణ ఇచ్చాం. పారిశుధ్యం, తాగునీటి సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో కార్యదర్శులు ప్రతిరోజూ జరిగే కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటాం.

**– కృష్ణ, డీపీవో, నాగర్‌కర్నూల్**